# ఇదిగో, నేనొక నూతన క్రియ చేయుచున్నాను

భక్తసింగ్

తృతీయ ముద్రణ : నవంబరు 1985
ప్రతులు : 3000

పుస్తకములు కావలసినవారు ఈ క్రింది
అడ్రసుకు వ్రాయమనవి

హెబ్రోను
గోల్కొండ చౌరస్తా
హైదరాబాదు - 500 020.

# ఇదిగో, నేనొక నూతన క్రియ చేయుచున్నాను

ఈ వాక్యములోనున్న దేవుని సందేశము రక్షింపబడినవారికి, రక్షింపబడని వారికి చెందును. దేవుడు నీ జీవితములో ఒక నూతన క్రియను చేయవలెనని కోరుచున్నాడు. మరియు నీకు ఏదో ఒక క్రొత్తదానిని చూపించవలెనని కోరుచున్నాడు. ఈ మాటలను సజీవుడైన దేవుడు నీకిచ్చు వాగ్దానముగా తీసికొనుము. దేవుడు నీ జీవితములో ఒక నూతన కార్యమును చేయనై యున్నాడని హృదయపూర్వకముగా నమ్ముము. ఆ నూతన కార్యము నీలో నెరవేర్చబడవలయునని కోరిన యెడల ప్రార్థన ద్వారా ఆసక్తితో దాని కొరకై వెదకుము.

ఈ క్రింది లేఖనముల వైపు నీ గమనము నుంచవలయునని కోరుచున్నాను.

"ప్రభువా నీవు ఆది యందు భూమికి పునాది వేసితివి. ఆకాశములు కూడ నీ చేతి పనులే. అవి నశించును గాని నీవు నిలిచియుందువు. అవన్నియు వస్త్రము వలె పాతగిలును. ఉత్తరీయము వలె వాటిని మడిచి వేతువు. అవి వస్త్రము వలె మార్చబడును గాని నీవు ఏకరీతిగానే యున్నావు. నీ సంవత్సరములు తరగవు" (హెబ్రీ 1:10-12).

"ఆకాశములు దేవుని మహిమను వివరించుచున్నవి. అంతరిక్షము ఆయన చేతి పనిని ప్రచురపరచుచున్నది. పగటికి పగలు బోధ చేయుచున్నది. రాత్రికి రాత్రి జ్ఞానము తెలుపుచున్నది. వాటికి భాష లేదు, మాటలు లేవు, వాటి స్వరము వినబడదు" (కీర్తన 19:1-3).

నీవు నక్షత్రములను చూచునప్పుడు బలమైన దేవుని కార్యములను చూచి ఆశ్చర్యపడకుండ ఉండలేవు. ప్రకృతిని చూచి ఆనందించలేని వారు కొందరు కలరు. అయినను నాస్తికునితో సహా ప్రతి ఒక్కరు సూర్య చంద్రాదులను, నక్షత్రములను చూచి తన్మయులగుదురు. ఆకాశము నందలి నక్షత్రములు ఇంత శోభావంతమైనవైనను దేవుని వాక్యములో 'అవి నశించును' అని చెప్పబడి యున్నది. కొందరు గుల్మముల సౌందర్యమును చూచి ఆనందించెదరు. ప్రకృతి సౌందర్యము వైపు కొందరు ఆకర్షింపబడెదరు. మరి కొందరు సముద్రములోని జలచరములను, మత్స్యములను చూచి సంతసించెదరు. నా జీవితములోని ఒక విషయము నాకు యింకను జ్ఞాపకమున్నది. అవి నేను నాస్తికునిగా నున్న దినములు. శాస్త్రీయ విద్యను నేర్చి, గర్వముచే దేవుడే లేడని పలుకుచున్న దినములలో ఒకనాడు నా మిత్రుడు లండన్‌లోని జలచరములున్న ప్రదర్శన శాలకు నన్ను తీసికొని వెళ్ళెను. ఆ విశాలమైన అక్వేరియములోనున్న జలచరములను చూచి తన్మయమునొంది యిట్లు పలికితిని. "దేవుడు లేడని చెప్పువాడు కేవలము బుద్ధిహీనుడు." సముద్రములో నివసించు అద్భుతమైన ఆ చిన్న జలచరములను చూచి ఎంతో విస్మయ మొందితిని. అయినను ఆ సౌందర్యము నశించును.

నేను చెప్పునదేమనగా, నిన్ను ముగ్ధునిచేయు ఎట్టి అందమైనప్పటికిని, నీ హృదయమును లోపరచుకొను ఎట్టి సౌందర్యమైనను ఒకనాడు నశించిపోవును. ప్రియ స్నేహితుడా, అందముగా నున్న దానిచే ఆకర్షింపబడి యున్నావా? గొప్పదైన దేనినో నీవు వెదకు చున్నావా? ఈ రోజు ప్రభువు నీతో చెప్పుచున్నాడు. "అవి నశించిపోవును." నీవు చూచిన దంతయును, ఆశించునదెల్లను, నీవు మెచ్చుకొనునదంతయును నశించి పోవును. తన మహిమను వెల్లడిచేయునట్టి తన హస్తకృత్యములనే దేవుడు నాశనము చేయనైయున్న యెడల మానవుడు చేసిన కార్యములు ఎంత ఎక్కువగా నశించిపోవును?

కొందరు ఎంతో వెలనిచ్చి వస్త్రములను కొనెదరు. మంచి వస్త్రములను ధరించవలెనను కోరిక ప్రతి ఒక్కరి హృదయములో నుండును. అందమైన చీరలు ధరించవలెనని స్త్రీలు, ఆకర్షణీయమైన కోటులను ధరించవలెనని పురుషులు కోరుదురు. ఒక చీర కొనుటకు ఎంతో ప్రయాసపడి, ఎంతో కన్నీటిని కార్చి, బజారులో ఎన్నో గంటలు తిరిగి దానిని కొనిన పిమ్మట అతి జాగ్రత్తగా దానిని భద్రపరచినను ఒకనాడు ఏ చిమ్మటయో తినివేయుట ద్వారా పడవేయవలసి వచ్చును. "ఉత్తరీయము వలె వాటిని మడిచివేతువు. అవి వస్త్రము వలె మార్చబడును." చాలా కాలము నిలచి యుండలేని వాటిని గురించి నీ సమయమును ఏల వ్యర్థపరచెదవు?

చిన్న పిల్లలు ఇసుకతో యిల్లు కట్టుట నీవు చూచి యుందువు. కొన్ని గంటలు ప్రయాసపడి ఆ యిల్లు కట్టుదురు. పిమ్మట ఒక క్షణములో దానిని కూల్చివేయుదురు. తిరిగి అది ఒక ఇసుక కుప్పగానే యుండును. ఇద్దరు వ్యక్తులు గొప్ప స్నేహితులుగా నుండవచ్చును. వారి స్నేహము కొరకై యెంతో డబ్బు వ్యయపరచి కూడ యుండ వచ్చును. అయితే ఒక్క కఠినమైన మాటతో ఆ స్నేహము విడిపోవును. ఇక స్నేహించుకొనుటకు బదులుగా ఒకరికొకరు కీడు కలిగించుటకు, ఒకరినొకరు నశింపచేయుటకును పూనుకొనెదరు. ఇదియే మానవ నైజము. ఇప్పుడు నీవు దేనిని కలిగియున్నావో, దేనిని పొందుటకు ఆశించుచున్నావో అది నశించిపోవునని దేవుని వాక్యము చెప్పుచున్నది.

కొందరు చంద్ర మండలమునకు వెళ్ళవలయునని ఆశించెదరు. ఇప్పుడు కూడ అమెరికాలో అనేకులు చంద్రుని సమీపించవలెనని కోరుచున్నారు. ఒక నక్షత్రము నుండి వేరొక నక్షత్రము వద్దకు ఎగిరిపోగలిగితే ఎంత హాయి అని తలంచెదరు. అయితే అది ఎవరికైనను తృప్తి కలిగించగలదా? నిజమైన సంతోషమును, ఆనందమును యివ్వగలదా? లేదు. ఎన్నటికిని యివ్వజాలదు;

ఎందుకనగా "ఆకాశములు నీ చేతి పనులే. అవి నశించిపోవును" అని లేఖనము చెప్పుచున్నది.

నశింపని దేదైనను నీ హృదయములోగాని, నీ గృహములోగాని లేక నీ జీవితములోగాని యున్నదా? 'అవును' అని చెప్పలేవు. నీ జీవితము, నీ హృదయము ఖాళీగా నున్నదని నీవు బాగుగా యెరిగి యున్నావు.

అయితే దేవుడు నీకు ఒక వార్త పంపుచున్నాడు. నీ జీవితములో ఒక నూతన క్రియ చేయవలయునని కోరుచున్నాడు. నశించిపోవు వాటి యందే నీవు యిప్పటి వరకు కాలమును వ్యర్థపరచియున్నావు. స్నేహితులను కోరుకొంటివి; అయితే వారు నీకు దుఃఖమునే కలిగించిరి. నీ యొద్ద నుండవలెనని కొన్ని వస్తువులను కోరుకొంటివి. అయితే అవి కొద్ది కాలమునకే నశించిపోయెను. అయినను చిరకాలము నిలిచియుండు వాటిని నీవు కోరుకొనుటకు నిరాకరించుచున్నావు. దేవుడు తన కృపావరములను బట్టి ఈ దినము ఒక నూతనమైన దానిని నీ కిచ్చుచున్నాడు. "ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను." ఈ దినమే ఆయన యిచ్చు దానిని స్వీకరించుము. ఆయన నిన్ను నూతన వ్యక్తిగా చేయును. ప్రతి దినము నీలో నూతన కార్యము జరిగించును. నీలో నూతన తలంపులను, నూతన కోరికలను పుట్టించును. ఇతరులు దానిని చూచి దేవుని మహిమపరచెదరు.

నేను తిరిగి జన్మించిన తర్వాత అన్నియు నూతనమయ్యెను. నూతన స్నేహితులు, నూతన పరిసరములు, నూతన స్వభావము నాకివ్వబడెను. నీలో కూడ నిత్యత్వము వరకు నిలుచు నూతన కార్యమును ప్రభువు చేయవలయునని కోరుచున్నాడు. అన్నియు నీకు నూతనమైనవిగా నుండును. ఎందుకనగా ప్రభువు తన వాక్యము నుండి నూతన విషయములు బయలుపరచును. క్రొత్తవాటిని

పొందవలయునను కోరిక సహజముగా మానవుని హృదయములో నుండును. క్రొత్త చెప్పులుగాని, క్రొత్త దుస్తులుగాని పొందినప్పుడు సంతోషించెదము. అయితే అవి యెప్పటికి క్రొత్తగా నుండలేవు. అంతేకాదు చాలా కాలము నిలచి యుండవు. అవి ఒక దినము పాతగిలి నశించిపోవును. అయితే ప్రభువు యిచ్చునవి ఎన్నటికిని, ఎప్పుడును క్రొత్తగానే యుండును. దానిలోని క్రొత్తదనము అనుదినము గోచరించును. ఆయన వాగ్దానములో నున్న గొప్పతనము యిదే. "ఇదిగో నేను సమస్తమును నూతనముగా చేయుచున్నాను."

మరల ప్రభువు వేరొక వాగ్దానము నిచ్చుచున్నాడు. నీ యౌవనము పక్షిరాజు యౌవనమువలె క్రొత్తదగును అని చెప్పుచున్నాడు. నీవు శారీరకముగా బలహీనుడవు కావచ్చును. యింతకు పూర్వము భుజింపగలిగినంత ఆహారము యిప్పుడు నీవు భుజింపలేక పోవచ్చును. అయితే ఆత్మీయముగా దేవుని విషయముల కొరకైన ఆకలి అధికమగును. వృద్ధాప్యములో దృష్టి మాంద్యము కలిగి కనుచూపు పోవచ్చును. అయితే వయస్సు గడచు కొలది నీవు ఆత్మీయ విషయములను స్పష్టముగా చూడగలవు. అందువలననే ప్రభువు "నేను సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నాను" అని పలుకుచున్నాడు.

ప్రియ స్నేహితుడా! ప్రభువు నీ విషయములో ఒక నూతన కార్యము చేయగోరుచున్నాడు. గడచిన సంవత్సరములలో నీ జీవితమును, నీ ద్రవ్యమును, నీ శక్తిని నీవు వ్యర్థపరచినప్పటికిని ఈ దినమున సజీవుడైన దేవుడు నీకు నూతన హృదయమును, నూతన మనస్సును, నూతన జ్ఞానమును యివ్వగోరుచున్నాడు. అన్నింటిలో నిన్ను నూతన వ్యక్తిగా చేయగోరుచున్నాడు. అదియెట్లు ప్రారంభమగునో నీకు తెలియదు కాని ప్రభువు తృప్తి చెందువరకు ఆ కార్యము నీలో జరుగుచునే యుండును. నీవు తిరిగి జన్మించిన

వాడవైనను నీకివ్వబడు వాగ్దానము యిదే. నీవు ప్రభువును చాల సంవత్సరముల నుండి ఎరిగినను, నీవు ఒక ఉపదేశకుడవైనను, అనేక ఆత్మలను ప్రభువు యొద్దకు నడిపించుటలో వాడబడినను నీలో నూతన కార్యము ప్రభువు చేయ నుద్దేశించుచున్నాడు.

నీవు ఈ వాగ్దానమును అనుభవించ గోరుచున్నావా? అయితే నీ జీవితములో జరిగిపోయిన దానిని మరువుము. నూతన విషయములకై సిద్ధపడుము. ఇప్పటి వరకు నిన్ను నడిపించినందులకు దేవుని స్తుతించుట మంచిదే. ఇప్పటివరకు నిన్ను వాడుకొనిన విధముకై ప్రభువును ఘనపరచవలసినదే. నీవు ఎంతో నేర్చుకొని యున్నావు. అనేక సంవత్సరముల నుండి ప్రభువు నీలో చేసిన దానికై ఎంతో సంతోషించుచున్నావు. అయినను ప్రభువు నీతో చెప్పుచున్నాడు, "నేను సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నాను" కనుక యౌవనస్తుడా! యౌవనస్తురాలా! వృద్ధుడా! వృద్ధురాలా! దేవుడు నీతో ఇదే చెప్పుచున్నాడు. "నీ జీవితములో నేను ఒక నూతన క్రియను చేయుదును." ఇంతకు మునుపు నీవు చూడనిది, ఇప్పటివరకు నీవు గ్రహించలేనిది ప్రభువు చేయనై యున్నాడు. "నేను ఇప్పటికే చాలా నేర్చుకొని యున్నాను. ఇక నేర్చుకొనుటకు మిగిలియున్నదేదియు లేదు" అని చెప్పకుము. నేను చాలా కష్టపడి పనిచేసితిని. ఇప్పుడు నేను పని నుండి విరమించ వలయుననవద్దు. ఆత్మీయ విషయము లలో అట్లు గాదు. ఆయన ఐశ్వర్యము ఎన్నటికిని తరగదు. "దేవుడు తన్ను ప్రేమించువారి కొరకు ఏవి సిద్ధపరచెనో అవి కంటికి కనబడలేదు, చెవికి వినబడలేదు, మనుష్య హృదయమునకు గోచరము కాలేదు" (1 కొరింథీ. 2:9). ఇవన్నియు పొందుటకై నేర్చుకొనుము.

బైబిలు చదువుట, కూటములకు హాజరగుట మొదలగునవి నీకు

కేవలము అలవాటులేనా? దేవుని వాక్యము నుండి ప్రతిదినము ప్రశస్తమైన నూతన విషయములను పొందుచున్నావా? దేవుని ప్రజల సహవాసము నుండియు, నూతనమైన అనుభవములను పొందుచున్నావా? ప్రతిదినము ప్రభువు యేదో నూతనమైన దాని నిచ్చుచున్నాడా? నీలో చేయనైయున్న ఈ నూతన కార్యమును నీకు తెలియపరచుమని ప్రభువును అడుగుము. దేవుని జీవము నీలోనుండి ప్రవహించవలయుననిన నీవు నూతన పరచబడవలెను. "మీ మనస్సు మారి నూతన మగుట వలన రూపాంతరము పొందుడి" (రోమా 12:2). పాత అభిప్రాయములకు, పాత సూత్రములకు బంధింపబడి యుండకుము. పాత అలవాటులకు, పద్ధతులకు బానిసవుగాకుము. దేవుని వాక్యము నీ యొద్దకు నూతనముగా రావలయును. నీకు నూతన రుచి కలిగించవలయును. "నాకు మొఱ్ఱపెట్టుము నేను నీకు ఉత్తరమిచ్చెదను. నీవు గ్రహింపలేని గొప్ప సంగతులను గూఢమైన సంగతులను నీకు తెలియజేతును" (యిర్మీయా 33:3). ప్రతి ప్రభువు దినమున నీ ఆరాధన నూతనమైనదిగా నుండవలెను. నీ ప్రార్థనా జీవితము ద్వారా నీ యౌవనము క్రొత్తదిగా చేయబడవలెను. నీ ఎడారి జీవితములోనికి నదులను పారజేయునట్లు ప్రభువు నీతో నూతనముగా మాట్లాడును. ఎండిన భూమిలాంటి నీ జీవితమును కస్తూరి పుష్పమువలె పుష్పించునట్లు చేయును (యెషయా 43:19; 35:1). అప్పుడు నీ జీవితము ఏ మాత్రము నిస్సారముగా గాని, నిష్ఫలితముగా గాని ఉండదు. నీవు దేవుని ఏర్పాటులోనికి వచ్చుటకు యిష్టపడుచున్నావా? అట్లయితే నిన్ను నీవు సంపూర్ణముగా ఆయనకు సమర్పించుకొనుము. అప్పుడాయన "ఇదిగో సమస్తమును నూతనమైనవిగా చేయుచున్నాను" (ప్రకటన 21:5) అను వాగ్దానము నీలో నెరవేర్చును.

## రెండవ అధ్యాయము

# మరుగైన మన్నా

ప్రభువు మనలో ఒక నూతన కార్యమును జరిగించుననిన సందేశము ఇంతకు పూర్వమే చెప్పబడెను. ఆ నూతన కార్యము ఇప్పుడో లేక తరువాతనో, ఎప్పుడు జరిగించవలయుననునది ప్రభువు పనియే. అయితే మనము ఎలాటి శ్రద్ధ వహించెదమో దానిమీద కూడ ఈ విషయము ఆధారపడియున్నది. పరిశుద్ధాత్మ ద్వారా ఈ మాటలను దేవుడు నీతో చెప్పుచున్నాడని నీవు నమ్మినట్లయితే, ఆయన తన వాగ్దానము నీ పట్ల నెరవేర్చును. దయచేసి ఈ మాటలను అల్పముగా ఎంచవద్దని మనవి చేయుచున్నాము. వాటి భావమేమైయుండునో, దానిని తెలియపరచుమని మోకాళ్ళమీదనుండి ప్రభువును అడుగుము.

ఒకవేళ నీ హృదయములోనున్న అంధకారమే నీవు విని గ్రహింప కుండునట్లు నిన్ను ఆటంక పరుచుచుండ వచ్చును. అయితే ప్రభువు యిచ్చిన అధికారముతో అంధకార శక్తులను గద్దించి, బంధించ గలము. ప్రభువైన యేసు సహపనివారమైన మనకు యిట్టి ఘనత యివ్వబడినది. నీవు కూడ ఆయన జత పనివాడవైనట్లయినచో నీవును ఆ ఆధిక్యతను పొందగలవు.

### ఎవరితో ఈ మాటలు పలుకబడెను?

మొట్టమొదటిగా, మానవుడవైన నిన్ను తన జతపనివానిగా నుండుటకు ఏల పిలుచుకొనెనో అని నీవు ఆశ్చర్యపడవచ్చును.

నాకును అది ఎంతో వింతగా యుండెను. నేను మొదటిసారి యిచ్చిన సాక్ష్యమును ఎన్నటికిని మరచిపోలేను. కెనడాలోని విన్నిపెగ్ అను పట్టణములో నేను నూతన జన్మము పొందిన తరువాత విశ్వాసుల సహవాసములో నుంటిని. వారందరు ఒకరి తరువాత ఒకరు ఎట్లు రక్షింపబడిరో చెప్పుచుండిరి. వారు రక్షింపబడిన విధమును గూర్చి చాల చెప్పిరి. నేను చెప్పవలసిన సమయము వచ్చినప్పుడు నేను చాలా భయపడితిని. నేను కూర్చుండిన స్థలములో నుండి లేచిన వెంటనే నా కాళ్ళు, చేతులు వణకుటకు ప్రారంభించెను. వణకుచునే ఈ మాటలు చెప్పితిని. "ప్రభువైన యేసు క్రీస్తు నన్ను కూడ రక్షించెను. నేను అగ్నిచేత కాల్చబడి బూడిద చేయబడుటకు మాత్రమే తగిన వాడను. ఎందుకనగా నేను బైబిలును చింపి వేసిన వాడను. క్రైస్తవులను హేళన చేసిన వాడను. అయినను ఆయన నన్ను కూడ రక్షించెను" అని చెప్పితిని.

ఇంత గొప్ప దేవుడు, బలమైన దేవుడు నాలాంటి దౌర్భాగ్యమైన అపవిత్రమైన, భయంకరమైన పాపిని ఎలా రక్షించెను? దేవుడు పాపులను వెదకి రక్షించి తన తోటలో తన సహపనివారినిగా చేసికొనవలయునని కోరుచున్నాడని బైబిలు చెప్పుచున్నది. బైబిలులో అనేకచోట్ల ఈ విషయము చెప్పబడెను. ఉదాహరణగా 1 కొరింథీ. 3:9లో మనము సజీవమైన, బలమైన దేవుని జతపని వారమని చెప్పబడినది. ఆయన జతపనివారు ఎవరు కాగలరో చూచెదము. "వెఱ్ఱి వారిని... బలహీనులైన వారిని ...నీచులైన వారిని, తృణీకరింపబడిన వారిని, ఎన్నిక లేనివారిని దేవుడు ఏర్పరచుకొని యున్నాడు." చెప్పబడిన ఈ గుంపులో దేనిలోనో ఒక దానిలో నీవు చేరి యుందువు. ఒక వేళ మొదటి గుంపులో లేకపోయిన రెండవ గుంపులోనైన లేక మూడవ, నాల్గవ గుంపులోనైనను చేరియుందువు.

మానవునిగా ఏదో ఒక గుంపుకు చెందక తప్పదు. వెర్రివారిని, నీచులను, తృణీకరింపబడిన వారిని, ఎన్నికలేని వారినే దేవుడు ఏర్పరచుకొనియున్నాడు. ఎండిన గడ్డిలాంటి వారినే తన జత పనివారుగా నుండుటకు పిలిచియున్నాడు. అంతేగాక బలవంతులను, జ్ఞానులను, ఎన్నికైన వారిని సిగ్గుపరచుటకు దేవుడు ఇట్టి పాత్రలను ఎన్నుకొనెను. ఈ దినములలో మీరు అణు బాంబులను గూర్చి వినుచున్నారు. అవి పర్వతములను ఆవిరివలె కరిగించగలవు. ఏది ఎక్కువ ఆశ్చర్యకరమైనది? అణు బాంబా లేక ఎండిన గడ్డియా? అణు బాంబువలె ఈ అల్పమైన ఎండిన గడ్డి మొక్కలను దేవుడు వాడుకొన గలిగితే, ఎండిన గడ్డే ఎక్కువ ఆశ్చర్యకరముగా నుండును.

## పాత్ర సిద్ధపాటు

ఆ పాత్రను లేక ఆయుధమును ఆయన సిద్ధపరచు వరకు దేవుని ఉద్దేశము దాని ద్వారా నెరవేర్చబడదు. నిస్సందేహముగా తాను తలంచిన దానిని, తనంతట తానే చేయగలడు. అయితే మనపట్ల ఆయనకున్న ప్రేమనుబట్టి ఈ పరిచర్యకై మనలను సిద్ధపరచు చున్నాడు. దైవిక ప్రేమ అనగా ఏమో నీవు గ్రహించవలయును. మానవ ప్రేమకు కొలత ఒక్కటే యుండును. అయితే దేవుని ప్రేమకు నాలుగు కొలతలు గలవు. పొడవు, వెడల్పు, ఎత్తు, లోతు. మానవ ప్రేమ కాలవ్యవధి కొన్ని సంవత్సరములు మాత్రమే. ఈ రోజు ప్రేమించుదువు. రేపు ద్వేషించుదువు. ఈ రోజు మీరు చాల బలమైన గట్టి స్నేహితులుగా నుండవచ్చును. కొన్ని సంవత్సరములైన పిమ్మట పరాయి వారివలె ప్రవర్తించెదరు. అయితే దైవప్రేమ శాశ్వతమైనది, నిత్యమైనది. ఆ ప్రేమను అనుభవింప వలయుననిన నీవు ఆత్మీయముగా ఎదుగవలెను. అట్టి అనుభవమును మనము ఇప్పుడు పొందవలయునని దేవుడు కోరుచున్నాడు.

## నూతన జీవము యివ్వబడుట

ఇప్పుడు ఈ వాక్యమును గమనించుడి. "ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను...నేను అరణ్యములో త్రోవ కలుగజేయుచున్నాను. ఎడారిలో నదులను పారచేయుచున్నాను" (యెషయా 43:19). నీవు నూతన జీవము అనగా ఏమో నేర్చుకొనినచో ఇట్టి అనుభవమును పొందుదువు. బహుశ నీ జీవితము ఇప్పుడు ఎడారివలె లేక అరణ్యమువలె నుండి యుండవచ్చును. నీకు ఎన్ని తలాంతులు, వరములు ఉండినప్పటికిని, సామర్థ్యము గలవాడవై నప్పటికిని, నీ జీవితము నిస్సారముగా నుండవచ్చును. ఎవరైనను నిన్ను "నీవు ఎందుకు ఈ లోకములో జన్మించితివి?" అని అడిగినట్లయిన, నీవు ఏమి చెప్పుదువు? పెద్దవాడనై, వివాహమాడి, తదుపరి ఒకనాడు మరణించుటకే జన్మించితినని చెప్పుదువా? లేక విద్యావంతుడనై అనగా బి.ఏ. లేక యమ్.ఏ. డిగ్రీలు సంపాదించి పిమ్మట చనిపోవుదును అని అవివేకివలె చెప్పుదువా? లేక ఏ పార్లమెంటు సభ్యుడనుగానో ఒక ఉన్నత పదవిని అందుకొనిన తరువాత మరణించుదును అని చెప్పుదువా? నీవు ఒక వేళ ఇట్లు తలంచుచుండినట్లయితే నీవు ఇంకను అరణ్యములోనే నివసించు చున్నావు.

నీవు ఎవరో, ఏమైయున్నావో, ఎక్కడనున్నావో ఎరుగలేకయున్నావు. అడవిలోని జంతువులు ఇటు అటు తిరుగుచున్న రీతిగానే నీవు కూడ తిరుగుచున్నావు. నీకు ధైర్యము, పనిలో నిపుణత, జ్ఞానము ఎంతగా యుండినప్పటికిని నీవు ఇంకను అరణ్యములోనే యున్నావు. అయితే ఇప్పుడు జీవముగల దేవుడు నీలో నూతన కార్యము చేయవలెనని కోరుచున్నాడు. నదులలో త్రోవ కలుగ జేయవలెనని కోరుచున్నాడు. అప్పుడు నీవు ఆయన అనుమతి, ఆజ్ఞ, పరలోక శక్తి స్వాధీనములో

లేకుండ ఒక్క అడుగు కూడ వేయజాలవు. అప్పుడు నీవు పలికిన ప్రతి మాట; చేసిన ప్రతి పని నిత్యత్వము వరకు నిలిచియుండు ఫలము నిచ్చును. ప్రభువైన యేసుక్రీస్తును తమ రక్షకునిగా అంగీకరించి, అయనచేత ఏర్పరచుకొనబడిన ప్రతి ఒక్కరి అధిక్యత యిదియే. వారు ఎన్నటెన్నటికిని అయనవారు. ఈ భూమిపై నుండియే నూతన జీవమును పొందినవారు.

## నూతన జీవము మనలో అభివృద్ధి నొందుటకై ప్రభువు చేసిన ఏర్పాటు

ఇప్పుడు నూతన జీవము పొందినవారు కూడ నేర్చుకొనవలసిన విషయములు చాలా ఉన్నవి. ఈ నూతన జీవము అనుభవించుటకు నీకు సహాయపడు మూడు విషయములు ప్రకటన 2:17లో దేవుడు తెలుపుచున్నాడు. (1) మరుగైన మన్నా, (2) తెల్లరాయి, (3) క్రొత్తపేరు. ఇవి కేవలము పేరులు కాదు గాని దేవుడు తన బిడ్డలైన ప్రతివారికి కూడ అనుగ్రహించునవిగా యున్నవి. కొంతమంది తల్లులు, పిల్లలు ఏడ్చునప్పుడు వారి ఏడ్పు మాన్పుటకై ఏవేవో యిచ్చెదమని చెప్పుదురు. దాని తరువాత వాటి విషయము పూర్తిగా మరచిపోయెదరు. అట్టి తల్లులవలె కన్నీటిని తుడిచే మాటలు దేవుడు పలుకడు. అయన ఏమి చెప్పినను అర్థ సహితముగా పలుకును. అయన ఒకరికి ఏమి యిచ్చునో అది అందరికి యిచ్చును.

అయితే అయన వాగ్దానములు మనలో వ్యక్తిగతముగా నెరవేర్చబడవలెననినచో మనము పాటించ వలసిన కొన్ని షరతులు ఉన్నవి. ఒక మానవుడు భూఫలము ననుభవించవలెనిననచో ప్రకృతి నియమములను తప్పక గమనించ వలయును. అతడు తప్పక పొలము దున్నవలయును, విత్తనము నాటవలయును, పిమ్మట నీరు

పోయువలెను. అట్లే మనము కూడ దేవుని వాగ్దానములను అనుభవించక ముందు దైవ నియమములను, సూత్రములను పాటించవలయునని లేఖనము చెప్పుచున్నది. కొందరు కొన్ని కన్నీటి చుక్కలను రాల్చినట్లయిన దేవుని యొద్ద నుండి వారు కోరినది పొందగలమని తలంచెదరు. అటువంటి ప్రయత్నములు మనుష్యుల యొద్దనే సాగును గాని దేవునియొద్ద సాగవు. కొంతమంది భార్యలు ఏడ్చుట ద్వారా వారి భర్తల నుండి తాము కోరినది పొందెదరు. అయితే కన్నీరు దైవ కట్టడలను మార్చలేదు. కొంతమంది ఏడ్చుట వలనను, బిగ్గరగా కేకలు వేయుట వలనను పరిశుద్ధాత్మను పొందగలమని, ఆత్మీయ వరములను సంపాదించగలమని తలంచెదరు. అయితే మానవ ప్రయత్నముల ద్వారా దైవ విషయము లను ఎన్నటికిని పొందలేరు. కనుక దేవుని నియమములను జాగ్రత్తగా గమనించుట అవసరము. అయన మరుగైన మన్నాను, తెల్లరాతిని, క్రొత్త పేరును ఇవ్వనై యున్నాడను విషయము సత్యము. అయితే అక్కడ చెప్పబడిన మాటలను గమనించుడి. "జయించువాడు" అని చెప్పబడినది. మనము ఈ మాటలను ఎంతగా అర్థము చేసుకొనెదమో అంతగా ఈ మూడు విషయములను అనుభవించగలము.

## మన ప్రత్యేక అవసరతకు సరిపోయిన ప్రభువు ఏర్పాటు

ప్రకటన 2:13లో ఇట్లు చెప్పబడినది. "సాతాను సింహాసనమున్న స్థలములో నీవు కాపురమున్నావని నేనెరుగుదును." నీవు ఇట్లు తలంచుచుండవచ్చును. నా జీవితములోని పరిస్థితులు పూర్తిగా వేరైనవి. నా జీవితములాంటి జీవితము ఎవరికి యుండదు. నాలాంటివారి జీవితములో దేవుని వాగ్దానములు ఎట్లు నెరవేరగలవు? యేసు ప్రభువు నా పాపము క్షమించెను. అందులో సందేహములేదు. అయితే, పాప స్వభావము కలిగిన నాలో ఈ వాగ్దానములు ఎట్లు

నెరవేరగలవు? అయితే, ప్రభువు ఇట్లు చెప్పుచున్నాడు. "నీవు నివసించు స్థలమును నేను ఎరుగుదును. అక్కడ అంధకార శక్తులు, దుష్ట శక్తులు బహు చురుకుగా పనిచేయుచున్నవని కూడ నేను ఎరుగుదును. అయినను అట్టి స్థలములోనే నీవు నా స్వరమును విని, నిన్ను ఆవరించు కష్టముల నన్నింటిని నీవు జయించినచో నేను ఈ మూడింటిని నీకిచ్చెదను!

మొట్టమొదటిగా, నీవు జయించలేని ఏ శోధనను కూడ ప్రభువు నీ జీవితములోనికి రానివ్వడని ఎరుగుము (1 కొరింథీ. 10:13). చిన్న బిడ్డవలె దేవుని వాక్యమును విశ్వసించుము. నీవు యౌవనస్తుడవైనను, ముసలి వాడవైనను, పురుషునివైనను, స్త్రీవైనను, ఎటువంటి శోధనలో నీవు వెళ్ళుచున్నను ప్రపంచములో ఏ మారుమూలలలో యున్నప్పటికిని ప్రభువు నీకిచ్చు మాట ఇదే. నీ ఎదుట నున్న ఆ శోధననుండి తప్పించు కొను మార్గమును ప్రభువు కలుగచేయును. ఆ మార్గమును తెలుసుకొనే హక్కు నీకివ్వబడినది. అదే సమయములో మరుగైన మన్నాను, తెల్లరాతిని, క్రొత్త పేరును నీవు వెదకిన యెడల శత్రువు ఎదిరించు మార్గము లన్నింటినుండి తప్పించుకొనే మార్గమును కనుగొనగలవు.

## మరుగైన మన్నా

ఈ మూడింటిలో మొదటి దానిని గమనించెదము. మొట్ట మొదట దేవుని ప్రజలు ఐగుప్తు నుండి కనాను దేశమునకు వెళ్లునప్పుడు వారికి ఆహారముగా మన్నా ఇవ్వబడెను (నిర్గమ. 16:15). ప్రతి ఉదయము సూర్యోదయమునకు ముందుగానే దేవుడు పరలోకము నుండి ఆహారమును పంపెడివాడు. ఈ చిన్న గింజలలాంటి పదార్థముకై వారు కష్టపడనవసరములేదు. భూమిని దున్ననవసరములేదు. అయితే

దినమంతయు వారి పనికై కావలసిన బలము నిచ్చుటకు ప్రతి ఉదయము పరలోకము నుండి ఆహారమివ్వబడెను.

యోహాను 6:49లో ప్రభువైన యేసు యూదులతో వారి పితరులు అరణ్యములో తినిన మన్నాను గూర్చి చెప్పెను. ప్రతి ఉదయము వారు ఈ మన్నాను తినినను వారు దాని ద్వారా బలము నొందినను, అది వారికి నిత్య జీవము నివ్వలేకపోయెను. అయితే జీవాహారమును ప్రభువు మాత్రమే యివ్వగలడు. ఆయనే జీవాహారము. ప్రభువును భుజించువారే నిత్యము జీవించుదురు. ఆరంభములో ఆయన అయిదువేల మందికి ఆహారము పెట్టిన సూచక క్రియను చూచి జనులు గుంపులు, గుంపులుగా ఆయన యొద్దకు వచ్చిరి. అయితే మన్నాకంటె శ్రేష్ఠమైన జీవాహారమును గూర్చి ఆయన వారితో చెప్పిన వెంటనే అనేకులు అభ్యంతరపడి ఆయనను విడచిపోయిరి. వారు యేసు ప్రభువు పరలోకమునుండి వచ్చెననియు, మరణము మీదను, అంధకార శక్తులు మీదను ఆయనకు అధికారము కలదనియు ఎరిగియుండిరి. అట్టి ప్రభువును గూర్చి వారు అభ్యంతరపడిరి. వారు గ్రుడ్డివారు. ఆ మాటలను అర్థము చేసికొనుటకు నిరాకరించిరి.

## మానవ స్వభావము మరుగైన సంగతులను కోరదు బాహ్యమైన సూచనలనే కోరును

నీవు కూడ నీ అనుభవములో దీనిని చూచియుందువు. ఏదో ఒక విధముగా అసాధారణమైన ఏదో గొప్ప సూచక క్రియను నీ జీవితములో చూడవలయుననే కోరుదువు. నేను క్రైస్తవ సేవను కెనడాలో ప్రారంభించినప్పుడు ఒక ఆత్మీయ వరమును పొందినట్లయిన దేవుడు నా ద్వారా బలముగా, లోతుగా పని జరిగించగలడనితలంచెడి వాడను.

సూచక క్రియలు, అద్భుతములు జరిగించబడవలెనని కోరెడివాడను. అట్లే ఆయన కృపతో అద్భుతములు జరిగింపబడు స్థలములకు నన్ను నడిపించెను. అయితే కొంతకాలము గడచిన పిమ్మట ఆ అద్భుతములను గావించినవారే పాపములో, అంధ కారములో జీవించుట గమనించితిని. కనుక మానవుడు తలంచిన రీతిగా, కోరిన రీతిగా బాహ్య సూచనల ద్వారా తన కార్యమును జరిగించడని గ్రహించితిని. మనకు తెలియని రీతిలో మౌనముగా కార్యమును జరిగించును. ఆయన కునుకడు, నిద్రించడు. సహజముగా మనము ఆహారము, వస్త్రములవంటి బాహ్యవస్తువుల మీద ఆధారపడుదుము. అట్లే బాహ్య సూచనలను చూడవలయునను కోరిక సహజముగా కలుగును. విశ్వాసులు కూడ బాహ్య విషయములనే మనస్కరించుచున్నారు. కూటములకు వెళ్ళుట ద్వారా, మంచి ప్రసంగములు వినుట ద్వారా, మంచి ఉపదేశమును పొందుటద్వారా, వ్యక్తులను కలిసికొనుట ద్వారా ఆత్మీయముగా బలవంతులమగుదుమని తలంచెదరు. అట్లు తలంచుచు ఆత్మీయముగా దరిద్రులగుదురు. ఎందుకనగా మరుగైన మన్నాను భుజించుట వారు ఎరుగరు.

## మరుగైన మన్నా యేసుక్రీస్తే

మరుగైన మన్నా యేసుక్రీస్తు ప్రభువే. ఆయన యొద్ద మౌనముగా రహస్యముగా కనిపెట్టిన యెడల ఆయనను భుజించగలవు. ఒకేసారి కొన్ని గంటలు కూర్చొని బైబిలు చదువుట సాధ్యమే. కొన్ని గంటలపాటు ప్రార్థించ వచ్చును కూడ. అనేక స్థలములలో ప్రార్థించవచ్చును. అయినను నీవు ఓడిపోయిన వాడవుగా నున్నట్లు కనుగొందువు. నీవు ఖాళీగానే యున్నట్లు తెలిసికొందువు.

నీవు ప్రభువు యొద్దకు రహస్యముగా వెళ్ళినప్పుడు ఆయన యొద్దకు అనేక మనవులను, విన్నపములను తీసికొని వెళ్ళుదువా? ఆయనను కొనియాడుచు, స్తుతించుటలో ఎంత సమయము గడిపెదవు? ఆయన యొద్దకు వెళ్ళినప్పుడు ఆరాధనలో బహు కొద్ది సమయమును గడుపుచున్నావా? బహుశ నీవు ఆరాధనలో కొద్ది సమయమును గడిపి, మనవులను విన్నవించుటలోనే అధిక సమయము గడుపుచుండవచ్చును. అయితే ఆయనను కొనియాడి ఆరాధించుటయే ఆయనను భుజించుట, పానము చేయుటయై యున్నది. ఆయనను భుజించుట ద్వారా, పానము చేయుట ద్వారా ఆయన నుండి నూతన జీవమును పొందుదుము. మరుగైన మన్నాలోని రహస్యమును ఎరుగుట ద్వారానే నీవు సహజమైన, భూలోక సంబంధమైన కోరికల నన్నింటినుండి విడిపింపబడెదవు. అంతేగాక, నీకు చాల బైబిలు జ్ఞానము కలదనే అతిశయము నుండి కూడ విడిపింపబడుదువు. నా క్రైస్తవ జీవితారంభములో బైబిలులోని అనేక వచనములను కంఠస్థము చేయుట ద్వారా చాల బైబిలు జ్ఞానము సంపాదించు కొనగలననియు, దానిని బట్టి నేను ఆత్మీయముగా బలాఢ్యుడను కాగలనని తలంచితిని. అయితే, ఆత్మీయముగా ఎంతో ఆకలి చెందుచుంటిని. మరుగైన మన్నా బైబిలు జ్ఞానము సంపాదించుటకు కాదు. ఆయనను కొనియాడి, ఆరాధించుట ఎప్పుడు నేర్చు కొంటినో, ఎప్పుడు ప్రభువు నాకు జీవాహారమయ్యెనో అప్పుడే నా ఆకలి తీర్చబడెను. అప్పుడే నేను తృప్తి చెందితిని.

## మరుగైన మన్నా నిండు తృప్తిని కలిగించును

మరుగైన మన్నాయే అపవాది నుండి నిన్ను రక్షించి, వాని తంత్రములన్నింటినుండి నిన్ను కాపాడును. శత్రువు ఎప్పుడును పురుషుల ద్వారానో, స్త్రీల ద్వారానో, పేరు ప్రతిష్ఠ పొందవలయుననే

కోరిక ద్వారానో, రమ్యముగా, ఆకర్షణీయముగా కనిపించు దేని ద్వారానో నిన్ను శోధించవలయునని ప్రయత్నించును. అవి అన్నియు ఎంతో మంచివిగా కనబడుచున్నవని ఈ నాడు కూడ నీవు భావించవచ్చును. అయితే నీవు మరుగైన మన్నా ద్వారా తృప్తి చెందినప్పుడు అట్టివాటిని కనీసము చూచుటకు కూడ యిష్టపడవు. ఆయన యొద్దకు నీవు వచ్చినట్లయితే, నీవు ఎన్నటెన్నటికిని ఆకలి చెందవనియు, దప్పిగొనవనియు యోహాను 6:35 లో ప్రభువు చెప్పెను. ఈ మాటలు సత్యమైనవి.

## అక్కర కలిగియుండిన స్థితియొక్క ఆవశ్యకత

### అలసట, ఆకలి.

ఆయనను నీవు జీవాహారముగా భుజించినప్పుడు నీ ఆత్మ మాత్రమే ఆయనను భుజించును. ఆయనను భుజించవలెననిచో శుభ్రమైన, పవిత్ర పరచబడిన ఆత్మ అవసరము. ఆత్మకు ఆకలి కూడ అవసరము. ప్రభువు తిరిగి లేచిన పిమ్మట గలిలయ సముద్రపు ఒడ్డున తన శిష్యులకు కనుపించెను. వారు అలసియుండుట ఆయన గమనించెను. కనుక వారికొరకై ఆయన ఆహారము సిద్ధపరచెను. మన ప్రభువు రొట్టెకొరకై ఏ దుకాణమునకు వెళ్ళలేదు. చేపకొరకై ఏ హోటలుకు కూడ వెళ్ళలేదు. వారు ఆ రొట్టె, చేపను ఎట్లు పొందిరో వారికి తెలియదు. అయితే అక్కడ ఆహారము సిద్ధముగా యుండెను. నిజమైన ఆహారము: రొట్టె, చేప వారు తినుటకై సిద్ధముగానున్న ఆహారము. ప్రభువు వారి అలసట, ఆకలి చూచినవాడై వారికి ఆహారము సిద్ధపరచెను. అట్లే నీ సేవ, నీ అవసరతను బట్టి ఆ మరుగైన మన్నాను నీకు యిచ్చును. అయితే నీవు ప్రభువు కొరకై ఏ పనియు చేయక, సోమరిగా నుండి, మరుగైన మన్నాను నీ కివ్వవలయునని ఎట్లు కనిపెట్టగలవు? కనుక మొదట సేవించుటకును, ప్రభువుకు

విధేయత చూపుటకును నేర్చుకొనుము. అప్పుడు ఆయన మరుగైన మన్నాతో నిన్ను ఎట్లు పోషించునో నీవే చూచెదవు. మనము మన క్రైస్తవ జీవితమును ప్రారంభించినప్పుడు క్రీస్తు మనలో నిరంతరము నివాసము చేయుటకు వచ్చును. అయనను, భుజించుటద్వారా, పానము చేయుట ద్వారా ఆయనను అధికముగా పొందుదుము. మన భారములన్నియు ఆయనే భరించును. అనేక పర్యాయములు దేవుని సేవలో రాత్రివేళలో సరియైన నిద్రయుండదు. మనము తిను ఆహారము కూడ స్వల్పమైనదై, మనము చేయవలసిన పనికి కావలసినంత బలము నివ్వలేనిదైయున్నది. అయినను దేవుడిచ్చిన పని నెరవేర్చుటకు కావలసిన బలమును, శక్తిని దేవుడనుగ్రహించుట మనము అనుభవించుచున్నాము. మరుగైన మన్నాతో ఆయన మనలను పోషించును.

మనము ఎక్కడ, ఎట్టి పరిస్థితులలో జీవించుచున్నామో అది దేవునికి తెలియును. మనము ఎదుర్కొను కష్టములను కూడ ఆయన ఎరిగి యున్నాడు. కనుకనే, జీవాహారమైన ఆయన యొద్దకు మనము రావలయునని ప్రభువు కోరుచున్నాడు. ప్రయత్నించి చూడుము. అవిధేయుడవుగా నుండకుము. అట్లు చేసిన తరువాత ఎట్లుండునో చూడుము. పరలోకము నుండి వచ్చిన మన్నా నిజమైన ఆహారము. ఆయనే మన యేసుక్రీస్తు ప్రభువు. ఆ మన్నా ఎట్లు చేయబడెనో, ఎట్లు వచ్చెనో, మన మెరుగము. అయితే అది పరలోకమునుండి వచ్చెను. ప్రజలు దానిని భుజించిరి. బలము నొందిరి. జీవాహారమును పొందుట నిజముగా ఎంత ధన్యత!

ఆయనను భుజించవలయునన్న మొదట నీలో ఆకలి యుండవలెను. బైబిలు జ్ఞానము కొరకు లేక అద్భుతములు లేక సూచక క్రియల కొరకై ఆకలి యుండుట సాధ్యమే. అయితే ప్రభువు

కొరకైన ఆకలి చాల అరుదు. అందువలనే నీవు సాతానుచే సులభముగా ఓడింపబడుచున్నావు. సాతానును జయించి విజయము నొందగోరుచున్నావా ? **అయితే**, నీ కొరకైన దేవుని ఏర్పాటు యిదే-మరుగైన మన్నా.

దేవుడు నీలో నూతన కార్యమును చేయవలయునని కోరుచున్నాడు. నీవు ఎక్కడకు వెళ్ళినను నీకు ఉదయము, మధ్యాహ్నము, సాయంకాలము మంచి ఆహారమును అనుగ్రహించును. కెనడాలో నేను మార్చబడిన తరువాత నా యొద్ద డబ్బు లేకుండెను. కనుక హోటలులో నేను ఒక వంటవాని పని చేయవలసి వచ్చెను. దాని కొరకై ప్రతి ఉదయము ప్రార్థించెడివాడను. ప్రతి వంటకములోను పదార్థములు ఏ పరిమాణములో వేయవలయు నోయని ప్రార్థించెడివాడను. అట్లు ప్రార్థన చేసి వంటచేసెడివాడను. ఆహారము ఎంతో రుచిగా నుండెడిది. కమ్మని వాసనకూడ వచ్చు చుండెడిది. ప్రజలందరు నేను అనుభవము పొందిన, నిపుణతగల వంటవాడినని తలంచెడివారు. నేను వంట చేసే విధమును గూర్చి తెలిసికొనెడివారు. మామూలు ఆహారము చేయుటకే ప్రభువు ఇట్టి సామర్థ్యము నిచ్చినచో నీ ఆకలి దప్పి తీర్చు జీవాహారమును ఎంత ఎక్కువగా నీకివ్వగలడు? ఆ జీవాహారమును భుజించుట ద్వారా దేవుని వాక్యము కొరకై నీలో నూతన రుచి, నూతన ప్రేమ, నూతన ఆకలి కలుగును.

ఈ విధముగా ఆయన తన వాగ్దానమును నెరవేర్చును. "ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను... అరణ్యములో త్రోవను కలుగచేయుచున్నాను. ఎడారిలో నదులు పారచేయు చున్నాను" (యెషయా 43:19).

## మూడవ అధ్యాయము

# తెల్లరాయి

ప్రభువు మనలో ఒక నూతన కార్యము చేయగోరుచున్నాడని తెలిసికొంటిమి. దాని కొరకై మనలో నూతన జీవము నుంచెను. నూతన జీవము పొందిన వారందరును అందులోని ఆశీర్వాదములను అనుభవించలేకపోవు చున్నారను విషయము సత్యము. ఒక మనుష్యుడు ఎప్పుడును ఒక స్థలములో కూర్చుండి భిక్షమెత్తుకొను చుండెను. అతడు చనిపోయిన తర్వాత అతడు కూర్చుండీ యుండిన స్థలమును త్రవ్వగా అందులో ఎంతో ధనము దొరికెను. ఆ మనుష్యుడు ఆ డబ్బును అక్కడ దాచిపెట్టి, దానిని అనుభవించుటకు బదులుగా దానిపై కూర్చుండెను. అట్లే అనేకులు నూతన జన్మపొంది యున్నారు. గాని వారి ముఖముల మీద ఎట్టి ప్రకాశము కనిపించదు. వారి ఆత్మీయ దారిద్ర్యస్థితికై పరిస్థితులను నిందించెదరు. అయితే పరిస్థితులు ఎట్లున్నను మనము విజయవంతమైన జీవితము జీవించుటకు ప్రభువు ఏర్పాటు చేసియున్నాడు. అయితే ప్రకటన 2:17లో జయించువారికి ప్రభువు మూడు విషయముల నిచ్చుచున్నాడు. 1. మరుగైన మన్నా. 2. తెల్లరాయి. 3. క్రొత్త పేరు.

ఇందులో మొదటి దానిని గూర్చి ఇంతకు మునుపే చూచితిమి. మరుగైన మన్నా అనగా ప్రభువును భుజించుట. ఆయన శరీరమును తిని రక్తమును త్రాగుట, అతికాంక్షణీయుడైన ఆయనను ఆరాధించి, పూజించుటయై యున్నది.

ఆత్మీయముగా ఎదుగవలెననిన అద్భుతములు, బాహ్య సూచనలు జరుగవలెననియు, బైబిలు జ్ఞానము అధికముగా యుండవలెననియు తలంచెదరు. అయితే ఇవి ఏవియు మనలను తృప్తిపరచజాలవు. మనకు నిజమైన విజయము నివ్వజాలవు. ఒక సారి ఒక బైబిలు కళాశాల ప్రిన్సిపాల్ గారు నన్ను కలిసికొనిరి. అయన హెబ్రీ భాషలో పాండిత్యము గలవాడు, విద్వాంసుడు, అనేకుల కంటె అధిక జ్ఞానము కలిగినవాడు. అయినను అతడు మరుగైన మన్నాను భుజించు అనుభవములేదని ఒప్పుకొనెను. అందువలననే అతడు అనేక కష్టములను ఎదుర్కొనినప్పుడు ఓడిపోయినవాడయ్యెను. నీ విజయవంతమైన జీవితమును పాడుచేయుటకు శత్రువు ఎంతో యుక్తిగా నీయొద్దకు వచ్చును. నీ వెంత బలహీనుడవో దేవుడు ఎరుగును. అంతేగాక, శత్రువును సరియైన రీతిలో ఎదుర్కొనలేవని కూడ దేవుడు ఎరుగును. అందువలననే అనుదినము అయనను భుజించు ఏర్పాటు ప్రభువు చేసియున్నాడు. దానికి పరీక్ష యిదే. నీవు ప్రభువు యొద్దకు విన్నపములు లేకుండ ఎంత సమయము అయనను ఆరాధించి, కొనియాడుటలో గడుపుచున్నావు? నీవు ఎన్ని గంటలు ఆరాధించినను విసికిపోవు. అంతేగాక అయా పనుల వలన, బాధ్యత వలన నీవు లేచి వెళ్ళవలసి వచ్చినప్పుడు దుఃఖపడుదువు.

రహస్యముగా, మౌనముగా మరుగైన మన్నాను తినుటకు నేర్చుకొనితివా? విశ్వాసముద్వారా అయనను జీవపానముగాను, జీవాహారముగాను భుజించగలము. అయితే నూతన జన్మ అనుభవములేని వారు అయనలో పాలు పొందలేరు. నీ యింటిలో ఒక శవమున్న దనుకొనుము. ఆ శవమునకు నీవు మంచి ఆహారము యిచ్చి, తినమని కోరిన ఆ శవము ఆహారము తినగల్గునా? అదే రీతిగా నూతన జన్మ అనుభవములేని నీవు కూడ ఈ పరలోక ఆహారము

భుజించలేవు. వాసనకూడ చూడలేవు. ఒక వేళ నీవు తిరిగి జన్మించి యుండి నిత్యజీవ వరమును పొంది ఆయనతో నడచుచుండిన యెడల నీకు దిన దినమునకు అధికమైన ఆకలి ఆయన అనుగ్రహించును.

తెల్లరాయి : దేవుడు మనకు ఇవ్వనైయున్న తెల్లరాయిని గూర్చి తలంచెదము. ఇది మానవ జ్ఞానమునకు మించినది. దేవుడు అర్థములేనిది ఏదియు ఇవ్వడు. కనుక పాత నిబంధనలోని ప్రధాన యాజకుని వస్త్రములను గూర్చి తెలిసికొందము.

ప్రధాన యాజకుని వస్త్రములు ప్రభువైన యేసుక్రీస్తు సౌందర్యమును సూచించునవై యున్నవి. లేవీయకాండము 8వ అధ్యాయములో ప్రధాన యాజకుడు తన పరిచర్యకై ఎట్లు సిద్ధపడెనో తెలియుచున్నది. ఆయన అందరి యెదుట ముందుకు తేబడినవాడై సమాజ మంతటి యెదుట కడుగబడవలెను. తలనుండి పాదము వరకు ఆయనలో ఏలోపము యుండకూడదు. ఆయన శరీరములో ఏ లోపముండినను ఆ పదవికి అతడు అర్హుడు కాడు. ఒక వ్రేలు ఎక్కువ యున్నను అతడు ప్రధాన యాజకుడు కాలేడు. ఎవరైనను "ప్రధాన యాజకునిలో నేను లోపము కనుగొంటిని" అని చెప్పలేకుండ యుండవలెను.

యేసు రక్తములో కడుగబడినవారిలో కూడ ఏ దోషమును, లోపమును కనుపించదు. పరలోకములోని దూతలుకూడ వారిలో ఏ లోపము కనుగొనలేరు. ఎంతటి అద్భుత రక్షణ! ఎంతటి అద్భుత రక్షకుడు! నీవు యేసు ప్రభువును నీ స్వంత రక్షకునిగా అంగీకరించి యుండిన యెడల, దేవుని ఆత్మ నిన్ను ఎప్పటికిని ఆయన వానిగా చేసి, దైవ స్వభావమును నీ కిచ్చును. దేవుని కృప మాత్రమే ఇట్లు చేయగలదు. కాని ఏ మానవుడును చేయలేడు. కనుక నీవు ఎక్కడికి వెళ్ళినను దేవుని మహిమతో ప్రకాశింపగలవు. ఒకసారి ఒకడు గులాబి

చెట్టు క్రిందయున్న కొంచెము మట్టిని తీసికొనగా దానిలో నుండి మంచి వాసన వచ్చుచుండెను. అదే రీతిగా దేవునియొద్ద ఆయన పాదముల యొద్ద నీవు కనిపెట్టిన కొలది ఆయన మహిమ, సౌందర్యము, శక్తి నీలో ప్రకాశించును. ఈ భూమిమీద మన పరలోకపు పిలుపు ఇదే. ఈ భూమిపై నీవు ఏ వృత్తి చేయుచున్నను నీలో నుండి ఆయన పరిశుద్ధత యొక్క సువాసన వెలువడును.

ప్రధాన యాజకునికి సన్నపు నారతో కుట్టబడిన ఒక వస్త్రము కలదు. దానిపై నీలి అంగీ కూడ కలదు. దానిపై ఏఫోదు కలదు. ఆ ఏఫోదుమీద ఒక పతకముండును. ఆ పతకము మీద ఇశ్రాయేలు పండ్రెండు గోత్రములను సూచించు పండ్రెండు రాళ్ళు గలవు. ఆ పేర్ల క్రమము వారు బయలు వెళ్ళు దైవ క్రమము ననుసరించి యున్నది.

| | | |
|---|---|---|
| యూదా | ఇశ్శాఖారు | జెబూలూను |
| రూబేను | షిమ్యోను | గాదు |
| ఎఫ్రాయిము | మనష్షే | బెన్యామీను |
| దాను | ఆషేరు | నఫ్తాలి |

ఈ పండ్రెండు రాళ్ళ వెనుక ఊరీము, తుమ్మీము యున్నవి. ప్రధాన యాజకుడు ఈ తెల్లటి వస్త్రమును, పండ్రెండు రాళ్ళను ఎట్లు పొందునో ప్రతి ఒక్కరికి తెలియును. అయితే ఊరీము, తుమ్మీము అక్కడికి ఎట్లు వచ్చెనో ఎవరును ఎరుగరు. అయితే వాటిద్వారా ప్రధాన యాజకుడు దేవుని మనస్సు తెలిసికొనగలడని మాత్రము ఎరిగి యుండిరి. ఊరీము, తుమ్మీము ద్వారా ప్రధాన యాజకుడు ఏ జనాంగము విషయమైనను, గోత్రము విషయమైనను, కుటుంబము విషయమైనను, వ్యక్తిగత విషయములలో నైనను దేవుని మనస్సును

తెలిసికొనగలడు. వారి సమస్యలు గూడ వీటిద్వారానే పరిష్కరించ బడుచుండెడివి. దేవుని మనస్సు ఊరీము, తుమ్మీము ద్వారా తెలియబడు చుండెను. అది ఎట్లు జరుగుచుండెనో తెలియదుగాని, అది జరిగెనని మాత్రము తెలియును.

1 సమూయేలు 29వ అధ్యాయములో దావీదు ఊరీము, తుమ్మీము విలువ నెరిగియుండికూడ సంప్రదించుటలో తప్పి పోయినట్లు చూచెదము. యుద్ధశూరుడై యుండి, తన స్వంతశక్తి, జ్ఞానముమీద ఆధారపడి యుండెను. అట్లుచేసి పూర్తిగా నిరాశ చెందెను. ఆయన భార్యా బిడ్డలు చెరపట్టబడిరి. ఆయన వస్తు సామగ్రి కాల్చివేయబడెను. నీవు కూడ నీ స్వంతశక్తి, జ్ఞానముమీద ఆధారపడినచో నీ పనియు కాల్చబడును. ఒక్క పొరబాటు ద్వారా అధిక నష్టము పొందుదువు.

దావీదు మంచివాడు. దేవుని హృదయానుసారుడు. ఏ కార్యమైనను చేయుటకు దేవునియొద్ద విచారణ చేసెడివాడు. అయితే యీ పర్యాయము అట్లు చేయుటలో తప్పిపోయెను. నీవు కూడ అట్టి పొరబాటులో పడగలవు. ఎన్నోసార్లు మన మందరము మన కోరికలద్వారా నడిపించబడి మన స్వంత ఆలోచనలద్వారా ఊడ్వబడుదుము.

దావీదు జనులు వారి భార్యలు, బిడ్డలు చెరపట్టబడిరని వినినప్పుడు దావీదు తప్పిదమువలననే అట్టి ఘోరము వాటిల్లెనని గ్రహించిరి. దావీదు దేవునియొద్ద విచారణ చేయలేదు. అందువలననే నష్టముకలిగెను. ఆ జనులు బలాఢ్యులైన యుద్ధశూరులు. దావీదుకు ఎదురు తిరిగి ఆయనను రాళ్ళతో కొట్టుటకు కూడ సిద్ధపడిరి. అదే రీతిగా నీవు కూడ దేవుని చిత్తమును తెలిసికొనుటలో తప్పిపోయినట్లయినచో నీవును, నీతో కూడ నున్న వారును నష్టపడుదురు. నీ ప్రియమైన స్నేహితులే నిన్ను వదలివేయగలరు.

ఆ జనులు బిగ్గరగా ఏడ్చినప్పుడే దావీదు తన పొరబాటును తెలిసి కొనెను. ఊరీము, తుమ్మీముతో విచారణ చేయుటకు మరచి పోయెనని గ్రహించెను. ప్రధాన యాజకుని పిలిపించి ఏఫోదును తెప్పించి, దేవుని యొద్ద విచారణ చేసెను. ఈ కథనుండి ఒక హెచ్చరికను పొందుము. శత్రువు మనలను దేవుని చిత్తమునుండి తప్పించి, మన మీద మనమే ఆధారపడునట్లు చేయును. అయినను మనము ధైర్యము తెచ్చుకొనుటకు ఒక విషయము కలదు. యెహోవా దావీదును క్షమించెను.

తన భార్యా బిడ్డలను, తన ఆస్తిని తిరిగి సమకూర్చెను. "దావీదు సమస్తము తిరిగి సంపాదించుకొనెను" (19 వ వచనము). చెరగా తీసికొని పోయినవారిని అమాలేకీయులు చంపలేదు. దావీదు వారిని ఓడించి కొల్ల సొమ్మును సంపాదించెను. అట్లే మనము కూడ దేవుని యొద్దనుండి ఎన్నో సార్లు తొలగిపోవుదుము. అయినను మనలను సంపూర్ణముగా శత్రువుకు అప్పగించడు.

ఈ తెల్లరాయికి వేరే అర్థము కూడ యుండవచ్చును. ప్రభువు మనలను నిత్యము నడిపించెదనని వాగ్దానము చేసెను (యెషయా 58:11). ఈ ఏర్పాటు ప్రతి విశ్వాసి కొరకు చేయబడినది. పాత నిబంధనలో ఒక్క ప్రధాన యాజకుడు మాత్రమే దేవుని మనస్సును తెలిసికొనెడివాడు. ఇప్పుడైతే ప్రతి విశ్వాసికి దేవుని చిత్తము తెలిసికొను అధికృత యివ్వబడినది (యోహాను 4:34; 6:38; 7:17; 8:28; 9:31). మనము ఆయన చిత్తమును తెలిసికొన గలిగిన యెడల ప్రభువు ప్రేమను అనుభవించగలము (మత్తయి 12:50; మార్కు 3:35; లూకా 8:21). నీవు ప్రతి వ్యక్తి గత విషయములో, కుటుంబ విషయములో, సమాజము విషయములోను దేవుని మనస్సును యెరుగునట్లు పిలుచేసి యున్నాడు.

నేను అటు, ఇటు అనేక దేశములకు సువార్తను ప్రకటించుటకు వెళ్ళినట్లయితే ప్రభువు సంతోషించునని ఒకప్పుడు తలంచితిని. అయితే నేను అరణ్యములో నున్నానని ప్రభువు నాతో చెప్పెను. జూలై 1941లో ప్రభువు నాకు ఈ వాగ్దానమిచ్చెను. "ఇదిగో నేనొక నూతన క్రియ చేయుచున్నాను... నేను అరణ్యములో త్రోవ కలుగజేయు చున్నాను" (యెషయా 43:19). నామౌన ధ్యానసమయములో ఈ వాక్యము బలముగా వచ్చినను దాని లోతైన అర్థము గ్రహించుటకు 14 సం॥ పట్టెను. "నూతన క్రియ", "అరణ్యములో త్రోవ" అనగా ఏమో అంతకుముందు గ్రహించకుంటిని.

ప్రభువు నడుపుదలను బట్టి ప్రతి పరీక్షలో జయము పొందగలవు. దేవుడు సముద్రములో మార్గము కలుగజేయును. వడిగల జలములో త్రోవ ఏర్పరచును (యెషయా 43:16). నేర్పరియైన ఆయన హస్తముల ద్వారా నీవు నడిపించ బడినప్పుడు ఆయన నడుపుదల నిన్ను అంధకారములోను, లోయలలోను క్షేమముగా నడిపించును. సాతాను నిన్ను ఎదిరించినను. చీకటిచే నీవు ఆవరింపబడి యున్నను ఆయన నడుపుదలలో "భయపడకుము, ఇందులో త్రోవ కలదు" అను ఆయన స్వరమును విందువు. ఇట్టి అనుభవమును ప్రతిదినము, ప్రతిక్షణము అనుభవించగలవు.

నీ చీకటి వెలుగుగా చేయబడునట్లు, శత్రువు నీ యెదుట ఓడింప బడుటకు ప్రకటన 2:17లో ప్రభువు మరుగైన మన్నా, తెల్లరాయి, ఆ రాతి మీద వ్రాయబడిన క్రొత్త పేరును ఇచ్చెదనని వాగ్దానము చేయుచున్నాడు. ప్రభువు నీతో మాట్లాడి, మార్గము చూపించువరకు కనిపెట్టి యుండుము.

**నీ అవసరతకొలది ప్రభువు తన నడుపుదల నీకను గ్రహించునుగాక!**

## నాల్గవ అధ్యాయము

# క్రొత్తపేరు

ప్రభువు మన జీవితములలో ఒక నూతన క్రియ చేయుటకు యిష్టపడుచున్నాడను విషయమును ఇంతకు మునుపే చూచితిమి. మన జీవితములలో నూతన కార్యము జరుగ వలెననినచో మరుగైన మన్నా, తెల్లరాయి, క్రొత్తపేరు పొందవలయునను కోరిక కలిగియుండ వలెను. ప్రభువు చేయనైయున్న ఆ నూతన కార్యము నిత్యమైనది. పాప క్షమాపణ పొందని వారి కొరకు, తిరిగి జన్మింపని వారి కొరకు, సంతోష సమాధానములు పొందని వారి కొరకు కొన్ని మాటలు చెప్పుచున్నాను. ఈ లోకములో మీరు ఏమి సంపాదించినను అది నిరంతరము నిలువదు. మానవ సామర్థ్యముతో నీవు ఏమి నేర్చుకొనినను అది ఒకనాడు మరచిపోవుదువు. హైద్రాబాదు కోటలో ఆ రాష్ట్రములోని రాజుల సమాధులు కలవు. వారు వెదలిపోయిన తరువాత వారి జ్ఞాపకార్థముగా ఏమైన యుండవలెనని కోరినవారై చనిపోక మునుపే అందమైన సమాధులను కట్టించిరి. అయితే, ఇప్పుడు అక్కడ ఏమి కనబడును? శిథిలములు తప్ప మరేమి కనబడవు. శిథిలములు, అందులో నివాసము చేయుచున్న ఎలుకలే కనిపించును. నీవు ప్రఖ్యాతినొంద ప్రయాసపడినను నీ అంతము కూడ అట్లే యుండును.

నీవు ఎన్ని ప్రయత్నములు చేసినను నిత్యసంతోషమును పొందజాలవు. నీ పాప స్వభావము దేవుని పరిశుద్ధ స్వభావముతో కలిసియుండజాలదు. కనుకనే, నిత్యత్వములో నీవేమియు

పొందజాలవు. "ప్రకృతి సంబంధియైన మనుష్యుడు దేవుని ఆత్మ విషయములను అంగీకరింపడు" (1కొరింథీ 2:14). అయితే దేవుడు తన నిత్యమైన సంతోషమును యివ్వవలెనని కోరుచున్నాడు. అందుకొరకై మొట్టమొదటిగా దేవుని ఆత్మ నీలోనికి రావలయును. ఈ అనుభవము ప్రతి దినము నిన్ను నూతన పరచును. అప్పుడే నీవు నూతన మర్మములను ఎరుగ గలుగుదువు. దేవుని వాక్యము ప్రతిదినము చదువుట ద్వారా నీవు బలవంతుడవు, ఐశ్వర్యవంతుడవు అగుదువు. అట్లు నీ జీవితములో నూతన సంతోషమును పొందుదువు. నీవు ఒంటరిగా నివసించుచుండినను నీవు సంతోషముగా నుండ గలవు. ఎందుకనగా ఈ సంతోషము భూసంబంధమైనదికాదు; అది పరలోకమునుండి వచ్చినది. అది నూతనమైనది, నూతనముగానే యుండును. మానవ ఆటంకములు ఎన్ని యుండినప్పటికిని నీ సంతోషము అభివృద్ధియగును. "అంజూరపుచెట్లు పూయకుండినను, ద్రాక్షచెట్లు ఫలింపకపోయినను, ఒలీవచెట్లు కాపులేక యుండినను, చేనిలోని పైరు పంటకు రాకపోయినను, గొఱ్ఱెలు దొడ్డిలో లేక పోయినను, సాలలో పశువులు లేకపోయినను నేను యెహోవా యందు ఆనందించెదను. నారక్షణ కర్తయైన నా దేవుని యందు నేను సంతోషించెదను" (హబ. 3:17,18). ఇట్టి సంతోషము నీ అనుభవముగా యుండవలెను.

ఇట్టి ఆనందమే ప్రభువు నీకివ్వవలయునని కోరుచున్నాడు. ఎందుకనగా ఆయన నిన్ను ప్రేమించుచున్నాడు. ఈ రోజు నీవు క్రుంగియుండవచ్చును. అధైర్యముతో, నిరాశతో నుండవచ్చును. నీ పాపము ద్వారా నీ సమాధానమును పోగొట్టుకొని యుండవచ్చును, దౌర్భాగ్యుడవైయుండవచ్చును. నీ పాపము ద్వారా నీ జీవితమును నాశనము చేసికొని యుండవచ్చును. అయినను ప్రభువు నిన్ను

ప్రేమించుచున్నాడు. నీకు నిజమైన పరలోక సంతోషము ప్రభువు యివ్వగోరుచున్నాడు.

ఒకసారి నేను ఒక స్నేహితుని కలిసికొని, ఆయనతో ఇట్లు చెప్పితిని, "దేవుడు నిన్ను ప్రేమించుచున్నాడు." అందుకు అయన నేను అబద్ధికుడనని నాతో అనెను. "భయంకరమైన పాపిని, నరహత్య చేసి అనేకమారులు చెరసాలకు సహితము వెళ్ళినటువంటి ఘోరపాపిని దేవుడు ఎట్లు ప్రేమించగలడు" అనెను. అందుకు, నేను కూడ గొప్ప పాపిని; బైబిలును సహితము చింపివేసిన దుర్మార్గుడను అయి నప్పటికిని ప్రభువు నన్ను క్షమించెను" అని అతనితో చెప్పితిని. "మీ అమ్మ నిన్ను ప్రేమించుచున్నదా?" అని ప్రశ్నించితిని. అందుకతడు ఆమె తనను ప్రేమించుచున్నదని చెప్పెను. "నీవు దానిని ఎట్లు ఎరుగుదువు?" అని మరల ప్రశ్నించితిని. "ఆమె నాకు క్రమము తప్పకుండ ఉత్తరములు వ్రాయుచుండును. నేను వ్రాయక పోయినను ఆమె వ్రాయుచుండును" అని చెప్పెను. అట్లు చెప్పుచుండగా ఆయన కన్నుల నుండి కన్నీటి చుక్కలు రాలెను. "ఆమెకు ఆ ప్రేమను ఎవరిచ్చిరి? అది దేవుని ప్రేమయే. ఆయనే ఆమెను తన అయోగ్యుడైన కుమారుని ప్రేమించునట్లు చేసెను" అని చెప్పితిని. ఆ దినమే అతడు మురికి బట్టలతో, క్షౌరము చేయబడని గడ్డముతో కూటమునకు వచ్చి ఆశ్చర్యకరముగా తన పాపములన్నియు ఒప్పుకొనుచు ప్రార్థన చేసెను. వెంటనే దేవుని వెలుగు అతని ముఖముపై ప్రకాశించెను.

ఈ లోకములోని ఏ శక్తియైనను ఆ మనిషిని మార్చగల్గెనా? ప్రభువు ఇచ్చే సంతోషము భూలోక సంబంధమైనది కాదు. ఆ సంతోషము భూ సంబంధమైన వాటిమీద ఆధారపడునదికాదు. ఆయన "నిన్ను కాపాడును" అని తానే వాగ్దానము చేయుచున్నాడు. "యెహోవా అను నేను దానిని కాపు చేయుచున్నాను. ప్రతి నిమిషమున నేను దానికి

నీరు కట్టుచున్నాను. ఎవడును దానిమీదికి రాకుండునట్లు దివారాత్రము దాని కాపాడుచున్నాను" (యెషయా 27:3). తన ప్రజలకు ఆయన చేసిన వాగ్దానములు ఇట్టి నూతనక్రియల ద్వారా నెరవేర్చుచున్నాడు. నీళ్ళుపోసిన తరువాత పుష్పములు నూతనముగా కనబడును. అట్లే విశ్వాసము ద్వారా ప్రభువు నీకిచ్చు సంతోషము, సమాధానము నూతనముగా నుండును.

ఈ ఆశీర్వాదము బలవంతముగా నీకివ్వబడదు. దానికొరకై నీవు అడుగవలెను. ప్రభువు నీతో మాట్లాడి, నీ పాపము నీకు చూపించును. నీకు సమాధానము, సంతోషము నివ్వవలయుననియే ప్రభువు నీ పాపమును బయలు పరచుచున్నాడు. శత్రువులైతే నిన్ను కించ పరచుటకు, ఇతరుల యెదుట నిన్ను అవమానపరచుటకే నీ పాపమును బయలుపరచెదరు. ప్రభువు అట్లుకాదు. కనుక ప్రభువు ఎదుట నీ పాపములు ఒప్పుకొనుటకు సందేహపడకుము. ఆయన నీ పాపములన్నిటిని క్షమించును. నీ గత పాపపు జీవిత స్మృతిని కూడ తొలగించును. ఇక నీ జీవితములోనికి ఎప్పటికి రాకుండ వాటిని తొలగించును.

కనుక ప్రియస్నేహితుడా, ప్రభువైన యేసునొద్దకు ఇప్పుడే వచ్చి నూతనముగా నీ జీవితమును ప్రారంభించుము. అప్పుడు దేవుడు నీకు అన్ని విషయములను నూతనమైనవిగా చేయును. నీ జీవితములో, నీ హృదయములో, నీ ఆత్మలో, నూతన క్రియ జరుగును. నీకు నూతన జ్ఞానము, ప్రభువును చూచుటకు నూతన దర్శనము, దేవుని స్తుతించుటకు నూతన నోరు, దేవుని మనస్సు గ్రహించుటకు నూతన మనస్సును, నూతన తలంపులను, నూతన భావములను, నూతన అనురాగములను, నూతన స్నేహితులను, నూతన వృత్తిని, నూతన ఆహారమును, నూతన బలమును అనుదిన

జీవితములో నీ కనుగ్రహించును. ఆయనను నీవు నూతనమైన రీతిగా ప్రతిదినము అనుభవించగలవు. అయితే మొట్టమొదటిగా నీవు ఈ ప్రార్థన చేయవలయును. "యేసుక్రీస్తు ప్రభువా, నేను ఒక నూతన వ్యక్తిని కాగోరుచున్నాను." నీవు యిష్టపడి, సిద్ధముగా నున్న యెడల నీ జీవితములో ప్రభువు నూతన కార్యమును తప్పక గావించును.

నూతనముగా జన్మించినవారికి ఒక్కమాట. ప్రభువు నిన్ను ప్రేమించుచున్నాడని కొంతకాలము క్రితమే నీవు కనుగొంటివి. నీకు గొప్ప నిరీక్షణ, నీ హృదయములో అధిక సంతోషము కలిగెను. నీ యొద్దకు వచ్చుటద్వారా అనేకులు ధైర్యపడిరి. అయితే ఇప్పుడు నీవు ఎట్లున్నావు? నీలో అప్పుడుండిన సంతోషము ఇప్పుడు నీలో కనబడదు. అంతేగాక అంతరంగములోని పాపపు ఛాయలు నీ ముఖముమీద కనబడుచున్నవి. ఇంతకు మునుపు నీలోనున్న ఆసక్తి కనబడుట లేదు. ఆ జీవము, ఆరాధనలోని స్తుతి యిప్పుడు కనబడుట లేదు. దేవుని ఇంటికి వచ్చుటలో నీకు సంతోషములేదు. ప్రారంభములో నీ అంతట నీవే సంతోషముతో దేవుని ఇంటికి వచ్చుచుంటివి. ఇప్పుడైతే నిన్ను బలవంతము చేయవలసి వచ్చుచున్నది.

ప్రారంభ జీవితములో నీవు పెందలకడనే దేవుని సన్నిధిలో మోకాళ్ళపై నుంటివి. ఇప్పుడైతే ధ్యానించవలయునను కోరిక నీలో లేదు. నీవు బైబిలు చదివి ప్రార్థన చేసినను కేవలము నీ భార్యనో లేక భర్తనో సంతోష పరచుటకు చదువుచున్నావు.

నీవు ఇట్టి స్థితిలో ఏల జీవించు చుండవలెను? నీ ముఖముపై పాపపు మరకలు ఏల కనబడనిచ్చెదవు? నీ స్నేహితులు నీ గతమును గూర్చి ఎరిగియుండక పోవచ్చును. అయినను నీ ముఖములో నుండిన ప్రకాశమైన వెలుగును కనుగొనలేక పోవుచున్నారు. నీ హృదయమును ఈ దినము పరీక్షించుకొనుము. తనవారికి ప్రభువిచ్చుచున్న

సమృద్ధియైన సంతోషము, సమాధానము నీ హృదయములో నున్నదా? పొంగుచున్న ఆనందమును ఇతరులతో పంచుకొనగలుగు చున్నావా?

దేవునియొక్క వరములను అనుభవించుచు, సమృద్ధియైన జీవమును అనుభవించుటకు దేవుడు ఏర్పాటు చేసిన మూడింటిని గూర్చి, ప్రకటన 2:17లో చూచితిమి. మరుగైన మన్నా, తెల్లరాయి, క్రొత్తపేరు అనునవియే. మరుగైన మన్నా అనగా ఏమో, తెల్లరాయి అనగా ఏమో, ఇంతకు మునుపే చూచితిమి, క్రొత్తపేరు అనగా ఏమో చూచెదము.

## సీమోను (పేతురు)

మత్తయి 16:18 లో యేసు ప్రభువు సీమోనుకు క్రొత్తపేరు ఇచ్చెను. ఇక మీదట నీవు పేతురు అనబడుదువు అని చెప్పెను. పేతురు అనగా బండ. ఎట్టి పరిస్థితులలో ఇట్లు జరిగెను? యేసు ప్రభువు శిష్యులను ఇట్లు ప్రశ్నించెను. "జనులు నన్ను గూర్చి ఏమని తలంచుచున్నారు?" అప్పుడు సీమోను "నీవు సజీవుడగు దేవుని కుమారుడవైన క్రీస్తువని" చెప్పెను. అందుకు యేసు-సీమోను బర్‌యోనా, నీవు ధన్యుడవు. పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలు పరచెనే గాని నరులు నీకు బయలు పరచలేదు. ఆ దినమునుండి సీమోను పేరు 'పేతురు' అని మార్పుచెందెను.

క్రీస్తును గూర్చిన ఈ ప్రత్యక్షత మీదనే సంఘము కట్టబడినది. అందువలననే ప్రభువు, "ఈ బండమీద నా సంఘమును కట్టుదును. పాతాళ లోక ద్వారములు దానియెదుట నిలువనేరవు" అని చెప్పెను. క్రీస్తును గూర్చిన ప్రత్యక్షత నీ అంతరంగములో నీవు కలిగి యుండినయెడల అది మానవుల వలన కలిగినదికాదు. అది పరలోకము నుండి కలిగినది. అట్టి ప్రత్యక్షతను నీవు కలిగియున్న

యెడల నీకు కూడ క్రొత్తపేరు యివ్వబడును. అప్పుడు పాతాళలోక ద్వారములు నీ యెదుట నిలువజాలవు.

నీవు ఆయా పేర్లుగల సంఘములకు చెందినవాడవైతే మనుష్య ఆచారములకు, కట్టడలకు, పద్ధతులకు లోబడినవాడవై యుందువు. ఇవన్నియు నీకు ఆత్మీయ గ్రుడ్డితనమును కలుగజేసి నీలో కలవరమును, పోరాటమును కలిగించును. అయితే మానవ సంబంధమైనవి, లోక సంబంధమైనవి, చెడుగుతో కూడిన వాటినన్నింటిని విడచి పెట్టి ఆత్మీయ సంబంధమైన, పరలోక సంబంధమైన, నిత్యమైనవాటిని వెదకు విశ్వాసులే నిజమైన సంఘము. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మలను గూర్చిన ఆత్మీయ ప్రత్యక్షతమీద వారి జీవితములు ఆధారపడియుండును గనుక వారిని ఏదియు కదలించజాలదు (లూకా 10:22).

యేసు ప్రభువును మానసికముగా ఎరిగియుండి, ఆయన అద్భుత కార్యములను గూర్చి తెలిసికొనినంత మాత్రమున రక్షింపబడలేము. ఈ భూమిపై ప్రభువైన యేసుకంటె ఎక్కువగా అద్భుతములను జరిగించిన వారుఎవరున్నారు? అయినను అట్టి గొప్ప అద్భుతములను చూచిన వారందరు ఆయన యందు విశ్వాసముంచలేదు (యోహాను 6:66). యేసు ప్రభువు నీకు వాస్తవమైనవాడు కావలెను. ఆయన మహిమను గూర్చి, గొప్పతనమును గూర్చి నీవు ధ్యానించుదువా? నీవు ప్రభువును ఎరిగినప్పుడే ఆరాధించగలవు. నీవు ఆయనను ఆరాధించలేక పోయినచో ఆయన జ్ఞానములో నీవు ఎదుగలేవు.

సీమోను ఎన్నో బలహీనతలు కలిగినవాడు. అయినను, ఆయన ప్రభువును ఎరిగియుండెను. "నీవు సజీవుడైన దేవుని కుమారుడవైన క్రీస్తువు" అని చెప్పెను. ఆయనను గూర్చి ఇట్టి అంతరంగ జ్ఞానము,

ప్రత్యక్షత కలిగియున్నావా? అట్టి జ్ఞానముతోనే సంఘము కట్టబడు చున్నది. ప్రభువును గూర్చి అట్టి జ్ఞానము కలిగియుండిన నీకు క్రొత్త పేరు ఇవ్వబడును.

## మరియ

మరియ యేసు పాదములయొద్ద కూర్చుండి యుండెను. అప్పుడు ఆయన ఆమెనుగూర్చి ఇట్లు చెప్పెను. "మరియ ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనెను. అది ఆమె యొద్దనుండి ఎన్నటికిని తీసివేయబడదు" (లూకా 10:42). నీవు ప్రభువుతో అట్లు సమయమును గడుపు చున్నావా? సాధారణముగా ప్రజలు ప్రభువు పాదములయొద్ద కూర్చొనే దానికంటె మిగతా విషయముల పైననే మనస్సు నుంచుచున్నారు. నీవు ఉత్తమమైన దానిని ఏర్పరచుకొనినప్పుడే సంఘము కట్టబడగలదు. అప్పుడు ఇక ఎట్టి తప్పుడు సిద్ధాంతముల ద్వారా కూడ నీవు మోసపరచబడవు.

## సౌలు (పౌలు)

సౌలు ఎట్లు వెలుగు చూచి స్వరము విని, ప్రభువునొద్దకు వచ్చెనో మనమెరుగుదుము. అప్పటినుండి ఆయన ఒక క్రొత్త వ్యక్తి అయెను. అప్పుడు ఆయన అంతియొకయకు వెళ్ళి దేవునివాక్య పరిచర్య కావించెను. అక్కడనే సంఘ క్రమమును నేర్చుకొనెను. పిమ్మట సువార్త పర్యటనను ప్రారంభించెను. పరిచర్యలో ఆయన గొప్ప తలాంతులు కలిగి యుండినప్పటికిని అంతియొకయలోని సంఘ క్రమమునకు లోబడియుండెను. అప్పుడే సంఘ క్రమమును గూర్చిన దేవుని ఉద్దేశములను గూర్చిన నూతన ప్రత్యక్షత కలిగెను. అతనికి క్రొత్తపేరు కూడ యివ్వబడెను. సౌలు అనగా నాశనము చేయువాడు. ఇప్పుడు

అతని పేరు పౌలు; అనగా పనిచేయువాడు. కనుక అతడు ఇక తన కొరకై జీవించక సంఘముకొరకై తనను తానే వ్యయపరచుకొనెను.

సంఘమునకు లోబడుట నీవు నేర్చుకొంటివా? ఉదాహరణగా ఒక్క విషయము చూడండి. తలిదండ్రులు చాలమంది పిల్లల వివాహ జీవితములను పాడుచేసియున్నారు. వివాహమునుగూర్చి సంఘమునకు తెలియచేయుటకు బదులు రహస్యముగా ఏర్పాట్లు చేయుదురు. ప్రియులారా, సంఘప్రార్థనను, సంఘ సహవాసమును, సంఘ ప్రేమను పొందు అధిక్యత మీకివ్వబడినది. దానిని తేలికగా చూడవద్దు.

నీవు సంఘ విలువను ఎరిగి, అన్ని విషయములలో సంఘమునకు లోబడియుండుట నేర్చుకొనినప్పుడే నీవు నాశనము చేయువాడవు గాక దేవుని యింటిలో పనిచేయువాడవుగా నుందువు.

## యాకోబు (ఇశ్రాయేలు)

యాకోబు కూడ క్రొత్త పేరు పొందెను. ఆయన అనేక తప్పిదములు చేసెను. అయినను దేవుని ఆశీర్వాదములోని సంపూర్ణ భాగమును పొందవలెనని ఆశించెను. ఆయన దేవునితో పోరాడి గెలిచెను. "నీ పేరు ఇశ్రాయేలే గాని యాకోబు అనబడదు" అని దేవుడు చెప్పెను (ఆది కాం. 32:28). ఇశ్రాయేలు అనగా దేవుని యొద్దనున్న రాజకుమారుడు అని అర్థము. నీవు దేవునితో ప్రార్థనలో పోరాడుటకు నేర్చుకొంటివా? అప్పుడే దేవుని యొద్దనుండి శ్రేష్ఠమైన వాటిని, గొప్ప వాటిని పొందుట ఎట్లో నేర్చుకొని వాటిని పొందగలవు. నీ జీవితము నీవు దేవుని యొద్దనున్న రాజకుమారుడవని తెలియజేయును.

ఏశావైతే, యాకోబు వలెగాక జ్యేష్ఠత్వపు హక్కును త్రోసివేసెను. ఒక్కపూట కూటికై దానిని అమ్మివేసెను. కొందరు పాప క్షమాపణ పొందిన చాలును, పరలోకములో ఏదో మూలలో ఉండగలమని తృప్తిపడెదరు. క్రీస్తులో వారికున్న విలువ కట్టలేని స్వాస్థ్యము మీద ఏమాత్రము లక్ష్యముంచరు. ఏశావువలె నీవును సమృద్ధియైన జీవమును నీకివ్వగలిగిన దేవుని కృపా మహదైశ్వర్యమును తృణీకరించి, ఉన్నత పిలుపుయొక్క బహుమానమును అలక్ష్యము చేయుచున్నావా!

ప్రారంభ దినములలోనే యాకోబు ఆకాశము తెరువబడుటయు, దేవుని స్వరమును వినుటయను అనుభవమును కలిగియుండెను. అయితే చాలాకాలమైన పిమ్మటనే దేవునితో రాజకుమారుడుగా నుండే అనుభవమును పొందెను. నీవు నీ ఆత్మీయ జీవితమును ఆరంభించి యున్నావు. పరలోకము నీకు తెరువబడినదిగా యున్నది. దేవుని స్వరమును వినుచున్నావు. అయితే విశ్వాసమందు నీవు నిలకడగా యుండి, పరలోక ఐశ్వర్యమునందు మనస్సు నుంచినచో నీవు కూడ యాకోబువలె దేవునితో రాజకుమారుడుగా నుందువు, దేవుడు నీకు క్రొత్త పేరిచ్చును.

## అబ్రాము (అబ్రాహాము)

అబ్రామునకు కూడ అబ్రాహాము అను క్రొత్త పేరు ఇవ్వబడెను. "ఇక మీదట నీ పేరు అబ్రాము అనబడదు; నిన్ను అనేక జనములకు తండ్రినిగా నియమించితిని గనుక నీ పేరు అబ్రాహాము అనబడును. నీకు అత్యధికముగా సంతానాభివృద్ధి కలుగజేసి, నీలో నుండి జనములు వచ్చునట్లు నియమించుదును" (ఆది కాం. 17:5,6). ఆ సమయములో అతడు 90 ఏండ్ల వయస్సు గలవాడు. స్వాభావికముగా ఆ వయస్సులో అతనికి పిల్లలు పుట్టరు. అయితే పునరుత్థాన శక్తిద్వారా ఇస్సాకు

జన్మించెను. అతని తర్వాత ఇంకను ఆరుగురు కుమారులు జన్మించిరి.

సమృద్ధియైన జీవము, ఫలమును అనుభవించుటలోని రహస్యముతో పాటు ప్రభువు నీకు క్రొత్తపేరు ఇచ్చును. ఇందులో నుండి నీవు తప్పిపోయినచో అధికమైన నష్టమును అనుభవించెదవు. ఆత్మలో నీవు ఆశించినంత కాలము ప్రభువు నీకు మరుగైన మన్నా, తెల్లరాయి, క్రొత్తపేరు అనుగ్రహించును. ప్రభువు నీకు తన (చిత్తమును గ్రహించు) జ్ఞానము నిచ్చునుగాక!

***